RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD


హైదరాబాద్ | ఆదివారం, ఏప్రిల్ 19, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 16 | పేజీలు: 8 | వెల : రూ.1



హైదరాబాద్‌వాసులకు శుభవార్త..
ఎంఎంటీఎస్‌లో
అందరికీ ఉచిత ప్రయాణం!

# మహిళా బిల్లును అడ్డుకున్న పాపం వారిదే : ప్రధాని మోదీ

- విపక్షాలను మహిళలు క్షమించరు అంటూ మండిపాటు
- నారీ శక్తి ఆకాంక్షలను నలిపేశారన్న ఆవేదన
- దేశ మహిళలకే క్షమాపణలు తెలిపిన ప్రధాని
- రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుందన్న హామీ
- విపక్షాలకు గుణపాఠం తప్పదన్న హెచ్చరిక



**చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే మహిళా రిజర్వేషన్ల బిల్లును విపక్షాలు లోక్‌సభలో అడ్డుకోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాలు, తమ ఆధిపత్యం పోతుందనే భయంతోనే ప్రతిపక్షాలు నారీశక్తి ఆకాంక్షలను కర్కశంగా నలిపేశాయని ఆయన మండిపడ్డారు. ఈ చారిత్రక బిల్లు ఆమోదం పొందకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, దేశ మహిళలందరికీ మోదీ మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేశారు. మహిళల ఎదుగుదలను అడ్డుకున్న విపక్షాల పాపానికి, తగిన సమయంలో నారీలోకం వారికి కచ్చితంగా గుణపాఠం చెబుతుందని ఆయన హెచ్చరించారు.**

న్యూఢిల్లీ: మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును లోక్‌సభలో విపక్షాలు అడ్డుకోవడం దేశ మహిళల ఆశయాలను దెబ్బతీసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. బిల్లు ఆమోదం పొందకపోవడం పట్ల తాను తీవ్రంగా విచారం వ్యక్తం చేస్తున్నానని, దేశంలోని మహిళలందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలుపుతున్నానని వెల్లడించారు. జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు స్వార్థ రాజకీయాల కోసం మహిళల హక్కులను అణచివేశాయని, వారి అసలు స్వరూపం బయటపడిందని ప్రధాని విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకోవడం జరిగిందని, దేశ ప్రజలు దీనిని గమనిస్తున్నారని అన్నారు. మహిళల ఆకాంక్షలను కర్కశంగా నలిపేసిన ఈ చర్యను వారు ఎప్పటికీ మర్చిపోరని, తగిన సమయంలో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. మహిళా సాధికారతకు ఈ బిల్లు కీలకమని పేర్కొంటూ, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే లోక్‌సభలో అవసరమైన మద్దతు లేకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేకపోయిందని చెప్పారు. అయినప్పటికీ మహిళా రిజర్వేషన్ల అమలుపై తమ కట్టుబాటు తగ్గదని

(మిగతా 2వ పేజీలో)




## తెలంగాణలో 9 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం

- అదనపు ఎస్పీ స్థాయిలో జరిగిన కీలక మార్పులు
- శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వివిధ జిల్లాలకు కొత్త అధికారులను నియమిస్తూ ఆదేశాలు



## తెలంగాణలో మండుతున్న ఎండలు.. కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

- ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు
- నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన



## తక్షణమే అమలు చేయండి!

**మహిళా రిజర్వేషన్‌పై సీఎం రేవంత్ సూచన**

- ప్రస్తుత సీట్లలోనే మూడో వంతు కేటాయిస్తే మద్దతు
- ఒకే రోజులో ఆమోదం.. వెంటనే అమలు సాధ్యమని వ్యాఖ్య
- పునర్విభజనతో కలిపే ప్రయత్నం తప్పుబాటు
- అఖిలపక్ష చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- కేంద్ర ఉద్దేశాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తం

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఆమోదం పొందిన చట్టాన్ని లేదా స్వల్ప సవరణలతో మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెడితే తాము పూర్తి మద్దతు ఇస్తామని వెల్లడించారు. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల్లోనే మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించే విధానం అమలు చేస్తే ఎలాంటి అవరోధాలు ఉండవని స్పష్టం చేశారు. ఒకే రోజులో బిల్లును ఆమోదించి వెంటనే అమలులోకి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అంశాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేయడం సరైంది కాదని సీఎం హెచ్చరించారు. అలా చేస్తే రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రజలు అంగీకరించరని తెలిపారు. పార్లమెంట్‌లో

(మిగతా 2వ పేజీలో)

## భారత నౌకలపై ఇరాన్ కాల్పులు: కేంద్రం

- రాయబారికి సమన్లు.. తీవ్ర నిరసన వ్యక్తం
- జలసంధి మూసివేతతో చిక్కుకున్న నౌకలు
- ఒప్పందం లేకపోతే బాంబుల ముప్పు: ట్రంప్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు గండం.. మళ్లీ యుద్ధ మేఘాలు
- పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చమురు రవాణాకు కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధి వద్ద పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. శనివారం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న భారత చమురు నౌకలపై ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ దళాలు కాల్పులకు దిగిన ఘటన ఆందోళన కలిగించింది. ఈ ఘటనతో నౌకలు ముందుకు సాగలేక వెనుదిరిగినట్టు అంతర్జాతీయ వర్గాలు వెల్లడించాయి. నౌకల్లోని సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ పరిణామంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఉన్న ఇరాన్ రాయబారిని పిలిపించి వివరణ కోరింది. ఈ చర్యను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిరసన తెలిపినట్టు సమాచారం. అదే సమయంలో మరికొన్ని భారత నౌకలు కూడా జలసంధి దాటకుండా వెనక్కు మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పలు నౌకలు అక్కడే నిలిచిపోయినట్టు తెలుస్తోంది. ఇక హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించడం పరిస్థితిని

(మిగతా 2వ పేజీలో)



## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

- భూముల ధరల పెంపుపై ప్రభుత్వం కసరత్తు
- ఈనెల 20 నుంచి భూ పటం ఆధారంగా రిజిస్ట్రేషన్లు
- పాలేరు నుంచి తొలి నమోదు ప్రారంభం
- వరంగల్ విమానాశ్రయానికి వేగం పెంచాలని ఆదేశం

హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు వేసవి అనంతరం జరిగే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో జరిగిన అనౌపచారిక సమావేశంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. రాష్ట్రంలో భూముల ధరల సవరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. గతంలో కొంతవరకు పరిశీలన జరిగినప్పటికీ, ఇప్పుడు సమగ్రంగా ధరల పెంపుపై కసరత్తు జరుగుతోందని చెప్పారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత కోసం

(మిగతా 2వ పేజీలో)

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్



- కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ
- కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళు తున్నారని ఆగ్రహం
- కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వుతున్నారని విమర్శ

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం.. రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్



- దక్షిణాది ప్రయోజనాలను కాపాడే బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయన్న బండి సంజయ్
- దక్షిణాది గౌరవం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు

వాయిస్ ఆఫ్ ప్రజలు
ఆదివారం, ఏప్రిల్ 19, 2026

# తెలంగాణలో 9 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం

**అదనపు ఎస్పీ స్థాయిలో జరిగిన కీలక మార్పులు**

**శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**వివిధ జిల్లాలకు కొత్త అధికారులను నియమిస్తూ ఆదేశాలు**




తెలంగాణ పోలీస్ శాఖలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదనపు ఎస్పీ (ఏఎస్పీ) స్థాయిలో ఉన్న 9 మంది అధికారులను బదిలీ చేస్తూ నిన్న రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా:**

కామారెడ్డి ఏఎస్పీగా ఉన్న బొక్కా చైతన్యరెడ్డిని సంగారెడ్డి అదనపు ఎస్పీగా, జనగామ ఏఎస్పీ పందిరి చేతన్ నితిన్‌ను జగిత్యాల ఏఎస్పీగా నియమించారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌ను మెదక్ ఏఎస్పీగా, వరంగల్ ఏఎస్పీ నగ్రాలె శుభమ్ ప్రకాశ్‌ను నిజామాబాద్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు. భైంసా అదనపు ఎస్పీ రాజేశ్ మీనాను వనపర్తి ఏఎస్పీగా నియమించారు. ఇక, ఆసిఫాబాద్ ఏఎస్పీ ఎస్.చిత్తరంజన్, ఆదిలాబాద్ ఏఎస్పీ పి.మౌనికలను అదే జిల్లాల్లో అదనపు ఎస్పీ (అడ్మిన్) పోస్టుల్లో నియమించారు. నిర్మల్ ఏఎస్పీ పత్తిపాక సాయికిరణ్ భైంసా ఏఎస్పీ (ఎస్‌డీపీఓ)గా, వేములవాడ ఏఎస్పీ రుత్విక్‌సాయి ఉట్నూర్ ఏఎస్పీ (ఎస్‌డీపీఓ)గా బదిలీ అయ్యారు. బదిలీ అయిన అధికారులు వెంటనే కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# తెలంగాణలో మండుతున్న ఎండలు.. కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత



**ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు**

**నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన**

తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం నేడు 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

## కోర్టు దిక్కరణ కేసులో ఆర్డీవోకు జైలు శిక్ష

**రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డికి**

**నెల రోజుల జైలు శిక్ష, 2వేల జరిమానా విధించిన న్యాయస్థానం**

**భూవివాదంలో కోర్టు ఉత్తర్వులు పాటించకపోవడమే కారణం**

**అప్పీలు కోసం తీర్పు అమలును రెండు వారాలు నిలిపివేత**



కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకట్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు నెల రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. అప్పీలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును రెండు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు వారాలు అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లోని 74.97 ఎకరాల భూమిపై వివాదం నడుస్తోంది. ఈ భూమికి సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాలను ఆర్డీవో వెంకట్‌రెడ్డి నిర్దిష్ట గడువులోగా అమలు చేయలేదు. దీనిపై భూమి యజమాని నవాబ్ మహ్మద్ యూసుఫుద్దీన్ ఖాన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే ధిక్కరించారని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం.. రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్



నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు. 2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకుని, దక్షిణాది ప్రజలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే సీట్ల కోతకు విపక్షాలే బాధ్యత వహించాలని, ఈ ద్రోహాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

# హైదరాబాద్ వాసులకు శుభవార్త.. ఎంఎంటీఎస్‌లో అందరికీ ఉచిత ప్రయాణం!

**జూన్ 2 నుంచి పథకం అమలుకు ప్రభుత్వ సన్నాహాలు**

**ఏటా రూ.10 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైన రాష్ట్ర సర్కార్**

**తొలుత ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు**



హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్య సమస్యలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజారవాణాను ప్రోత్సహించే లక్ష్యంతో, ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని యోచిస్తోంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నుంచి ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రతిపాదనకు పచ్చజెండా ఊపారు. ఈ పథకం అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో సమావేశమయ్యారు. ఏడాది పాటు ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేసి, ఫలితాలను బట్టి కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం ఎంఎంటీఎస్ ద్వారా రైల్వేకు ఏటా రూ.10 కోట్ల ఆదాయం వస్తుండగా, ఆ మొత్తాన్ని తాము చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, దక్షిణ మధ్య రైల్వే జీఎంకు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ లేఖపై దక్షిణ మధ్య రైల్వే సానుకూలంగా స్పందించింది. ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి ముసాయిదా ఒప్పందం (ఎంవోయూ) పంపాలని కోరింది. దాన్ని పరిశీలించి రైల్వే బోర్డు అనుమతి తీసుకుంటామని తెలిపింది. అయితే, ఇదే సమయంలో ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన రూ.491.45 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రైల్వే శాఖ కోరింది. రద్దీ వేళల్లో ట్రిప్పులు పెంచాలని, స్టేషన్లలో సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులపై రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం నడుచుకుంటామని బదులిచ్చింది. ప్రస్తుతం నగరంలో 80 నుంచి 88 ఎంఎంటీఎస్ రైళ్లు మాత్రమే నడుస్తుండగా, రోజుకు సుమారు 40 వేల మంది ప్రయాణిస్తున్నారు. సమయపాలన లోపించడం, ట్రిప్పుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆదరణ తగ్గింది. ఉచిత ప్రయాణ పథకం అమలైతే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## మహిళా బిల్లును అడ్డుకున్న పాపం వారిదే: ప్రధాని మోదీ

స్పష్టం చేశారు. విపక్షాలు కుటుంబ రాజకీయాల వల్ల మహిళల ఎదుగుదలను సహించలేకపోతున్నాయని ఆరోపించారు. మహిళలు ఎదిగితే తమ రాజకీయ ఆధిపత్యం దెబ్బతింటుందనే భయంతోనే ఈ బిల్లును అడ్డుకున్నారని అన్నారు. దేశ మహిళలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని, భవిష్యత్తులో తమ తీర్పుతో సమాధానం ఇస్తారని పేర్కొన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్ల అంశం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని గుర్తుచేస్తూ, ఈ చారిత్రక అవకాశాన్ని విపక్షాలు కోల్పోయాయని ప్రధాని విమర్శించారు. మహిళల ఆశయాలను నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. విపక్షాల వైఖరిని తీవ్రంగా తప్పుబడుతూ, దేశ అభివృద్ధి, మహిళా సాధికారత కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. దేశ మహిళల ఆశీర్వాదాలు తమకు ఉన్నాయని, భవిష్యత్తులో మహిళల హక్కుల సాధన కోసం మరింత బలంగా ముందుకు సాగుతామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

## తక్షణమే అమలు చేయండి!

బిల్లు నిలిచిపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి తగిన ప్రతిస్పందనగా చూడాలని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారతపై నిజమైన నిబద్ధత ఉంటే తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన వంటి సున్నిత అంశంపై ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి, నిపుణుల అభిప్రాయాలు సేకరించి ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి రాష్ట్ర అభిప్రాయాన్ని గౌరవిస్తూ, ప్రజాభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రాల మధ్య సమతౌల్యాన్ని కాపాడటం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్ర శాసనసభ స్థానాల పెంపుపై చర్చించవచ్చని సూచించారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు అవసరమైన సమాచారం ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం వద్ద అందుబాటులో ఉందని, సమర్థవంతమైన ప్రణాళికతో వేగంగా అమలు చేయవచ్చని తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. గతంలో మహిళలకు కీలక పదవులు ఇచ్చిన అనుభవం తమ పార్టీకి ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీపై విమర్శలు చేస్తూ, ఆ పార్టీలో మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో తీసుకొచ్చే ప్రతిపాదనలు దేశ సమగ్రతపై ప్రభావం చూపే అవకాశముందని సీఎం హెచ్చరించారు. అలాంటి నిర్ణయాలను ప్రతిపక్షాలు కలిసి అడ్డుకున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా రాష్ట్రాల హక్కులను కాపాడే దిశగా సమిష్టిగా ముందుకు సాగుతామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.


## భారత నౌకలపై ఇరాన్ కాల్పులు: కేంద్రం

మరింత సంక్లిష్టం చేసింది. తమపై కొనసాగుతున్న అమెరికా దిగ్బంధానికి ప్రతిస్పందనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ దేశం వెల్లడించింది. దిగ్బంధం కొనసాగినంత కాలం జలసంధి తెరవబోమని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కఠిన హెచ్చరికలు జారీ చేశారు. త్వరలోనే ఒప్పందానికి రాకపోతే కాల్పుల విరమణ కొనసాగదని, అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ భారీ దాడులు చేపడతామని హెచ్చరించారు. అణు కార్యక్రమం సహా అన్ని అంశాలపై సమగ్ర ఒప్పందం కుదరకపోతే ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ కమ్ముకుంటున్నాయి. కాల్పుల విరమణ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరుపక్షాల మధ్య మరో దఫా చర్చలు జరిపేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, స్పష్టత లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ఇక ఇరాన్ కూడా తన వైఖరిని కఠినంగా కొనసాగిస్తోంది. అణు కార్యక్రమంపై వెనక్కి తగ్గబోమని, తమ భద్రతకు భంగం కలిగించే ఒత్తిడిని అంగీకరించబోమని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో హార్మూజ్ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

భూ పటం ఆధారిత విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని, తొలి రిజిస్ట్రేషన్ ఖమ్మం జిల్లా పాలేరు ప్రాంతంలో చేపడతామని తెలిపారు. త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని సంకేతాలిచ్చారు. భూముల వ్యవహారాల్లో ఎదురైన సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యంగా అసైన్డ్ భూములపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, వాటికి సంబంధించి సమగ్ర పరిష్కారానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. వరంగల్ విమానాశ్రయం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగించినందున, త్వరలోనే శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన ప్రణాళికలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ వృద్ధికి మరింత ఊతం లభిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు.

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్



సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

# దుండిగల్ సర్కిల్ బిజెపి ఆధ్వర్యంలో
# కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే): కేంద్రం లోని శ్రీ నరేంద్ర మోడీ సారథ్యంలో నిన్న జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో చట్టసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంట్ లో బిల్లు పెడితే దాన్ని రాహుల్ గాంధీ ఆధీనంలో కాంగ్రెస్ మిత్ర ఇండి కూటమి వ్యతిరేకించడం అభ్యన్తరకరం మహిళలకు తీవ్ర తీరని అన్యాయం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లు దేశాన్ని సౌత్ కు నార్త్ విభజన రాజకీయం చేస్తూ డి లిమిటేషన్ పేరుతో సౌత్ కు అన్యాయం చేస్తున్నారని డి లిమిటెషన్ పేరుతో మహిళా బిల్లు అడ్డుకోవడం సిగ్గుచేటు. ముఖ్యమంత్రులు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన దానికంటే సౌత్ కు ఎక్కువగానే ఎంపీలను కేటాయించడం జరిగింది ఇది ఆమోదం చెంది ఉంటే తెలంగాణ లో 60 మంది మహిళా ఎమ్మెల్యేలకు అవకాశం వచ్చేది బీజేపీ లక్ష్యం జనాభా ప్రాతిపదిక ఏ ప్రాంతం అది ఈస్ట్ గాని వెస్ట్ గాని నార్త్ గాని సౌత్ గాని దేశమంతా ఒకటే ఎవరికి అన్యాయం జరగకూడదనే బీజేపీ సిద్ధాంతం ప్రధాని మోడీ సంకల్పం

మరి సౌత్ కు అన్యాయం చేస్తే మీతో పాటు కూడిన నార్త్ అపోజిషన్ పార్టీ నాయకులు ఉద్దవుతాక్రే శరత్ పవర్, అఖిలేష్ యాదవ్, లాలూ యాదవ్, మాయావతి మమత బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వీళ్లంతా ఎందుకు వ్యతిరేకించడం జరిగింది వీరందరి సంకల్పం మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కేటాయిస్తే వారికి పుట్టగతులు ఉండవని ఉద్దేశంతో మహిళలను అనచివేయడమే కాంగ్రెస్ అండ్ మిత్రపక్షల లక్ష్యం ఇకనైనా బుద్ధి మానుకోకపోతే భవిష్యత్తులో మీకు ఉన్న మూడు రాష్ట్రాలు కూడా ఊడి గల్లీలో తిరిగేటప్పుడు మహిళలతో చీపురు కట్ట దెబ్బలు తినాల్సి వస్తుందన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై వ్యతిరేకించిన కాంగ్రెస్ మిత్ర పక్షాలకు వ్యతిరేకంగా దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ,రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వరచారి, రాష్ట్ర ఎస్టి మోర్చా ఉపాధ్యక్షులు దాసరి శ్యామ్ రావు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనెమల్లారెడ్డి మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు దురాయి బాను గౌడ్, ధమ్మగారి సీతారాంరెడ్డి సీనియర్ నాయకులు ఏ శ్రీశైలం యాదవ్, డి ప్రభాకర్ రెడ్డి,జి మోహన్ రెడ్డి కృష్ణమోహన్ రెడ్డి,విష్ణు కార్యదర్శులు తలారి రాజ్ కుమార్,ఎస్ లత, మహిళ మోర్చా నాయకురాలు నాగమణి, గీత, తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంట్ లో మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ సుభాష్ నగర్ - సూరారం డివిజన్ బిజెపి నిరసన

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే): పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు వ్యతిరేక ఓటు ద్వారా వీగిపోయేలా చేసిన కాంగ్రెస్ మరియు ఇండీ కూటమి వైఖరిని తప్పుపడుతూ నిరసన తెలిపిన బిజెపి శ్రేణులు..సుభాష్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు శాంపూర్ విజయేందర్ రెడ్డి - సూరారం డివిజన్ బిజెపి అధ్యక్షులు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా బిజెపి శ్రేణులతో సూరారం చౌరస్తాలో నిరసన చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు.మల్లారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు వేదికగా కాంగ్రెస్, డిఎంకె,సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ మరియు ఇండి కూటమిలోని అన్ని పార్టీలు కలిసి 72 కోట్ల మహిళలకు తీరని ద్రోహం చేశారని.. నిన్నటి రోజు బ్లాక్ డే అన్నారు.మహిళలను ఓటు బ్యాంకుగా చూసే కాంగ్రెస్ పార్టీకి, రానున్న రోజుల్లో మహిళలే బుద్ధి చెబుతారని అన్నారు .మహిళా సంక్షేమం, సాధికారత గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు.సభలో ఉన్న ప్రియాంక గాంధీ ఇతర మహిళ కాంగ్రెస్ ఎంపీలు కూడా మౌనంగా ఉండిపోవడం, సిగ్గు మాలిన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యం.ఎస్.వాసు , బక్క శంకర్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండీ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తిబాబు రాజు,సాయిబాబా నగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ విఘ్నేష్ ముదిరాజ్, రఘుపతి, దేవర రమేష్,బావిగడ్డ రవి, వారాల మహేష్, సురేష్ గౌడ్, గోకుల్ యాదగిరి, బిజెవైయం అధ్యక్షులు బబ్లు,బిజెపి కంటెస్టెడ్ కార్పోరేటర్ కళ్యాణి శ్రీనివాస్, సీనియర్ నాయకురాలు దేవి,పుష్ప, అనిత, ఉమా, లక్ష్మీ, ప్రసన్న మరియు ఇతర మహిళా నాయకురాళ్ళు, బిజెవైయం నాయకులు, బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దళిత సంఘాల వెంటే బొంతు దంపతులు



నాగారం, ఏప్రిల్ 18:-(వాయిస్ టుడే): దళితులకు న్యాయం కోసం పోరాటం చేయడంలో బొంతు శ్రీదేవి యాదవ్ నాయకత్వానికి ఘన విజయం సాధించామని దళిత సంఘాలు పేర్కొన్నాయి. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తా మరోసారి చరిత్ర సాక్షిగా నిలవబోతోందని వారు అన్నారు. గతంలో అనివార్య పరిస్థితుల్లో తొలగించబడిన మహనీయుల విగ్రహాలను తిరిగి ప్రతిష్టించేందుకు సాగిన పోరాటం శనివారం ఘన విజయంగా మారిందన్నారు.

భారత సామాజిక సమానత్వానికి ప్రతీకలైన మహాత్మ జ్యోతిరావు పూలే, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్‌ల విగ్రహాలను తిరిగి అప్పగించే కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. అదే సమయంలో పాలాభిషేకం నిర్వహించి మహనీయులకు ఘన నివాళులు అర్పించారు. ఈ విజయానికి ప్రధాన కారణం బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ దృఢ సంకల్పం, నిరంతర పోరాటం, ప్రజల పట్ల అంకితభావం. దళిత సమాజానికి జరిగిన అన్యాయంపై ఆమె గళమెత్తి అధికార యంత్రాంగాన్ని కదిలించి, న్యాయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, దళిత సంఘాలు, స్థానిక నాయకులు ఆనందోత్సాహాలతో బొంతు శ్రీదేవి యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మా గౌరవాన్ని తిరిగి తీసుకొచ్చిన నాయకురాలు అంటూ ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కాగా దళిత సంఘాల నాయకులు బొంతు వారి నివాసానికి వెళ్లి, బొంతు దంపతులను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

# మహిళా బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకతకు నిరసనగా
# నాగారంలో బిజెపి రాస్తారోకో



నాగారం, ఏప్రిల్ 18:-(వాయిస్ టుడే) పార్లమెంట్ లో మహిళల రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇండి కూటమి వైఖరికి నిరసనగా నాగారం రాంపల్లి చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో జరిగింది. పార్లమెంట్‌లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే కీలక బిల్లును బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టగా, కాంగ్రెస్ మరియు ఇండీ కూటమి పార్టీలు వ్యతిరేకించడంతో ఆ బిల్లు ఆమోద దశలోనే నిలిచిపోయిందని బీజేపీ నాయకులు విమర్శించారు. మహిళల సాధికారతకు అత్యంత కీలకమైన ఈ బిల్లును అడ్డుకోవడం పట్ల నిరసనగా నాగారం బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఈ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించిన ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థలో ఒక కీలక మైలురాయిగా నిలిచేదని అన్నారు. అయితే కాంగ్రెస్ మరియు దాని ఇండి కూటమి యొక్క మిత్రపక్షాలు రాజకీయ లాభనష్టాల దృష్ట్యా ఈ బిల్లును వ్యతిరేకించడం వల్ల అది ముందుకు సాగకుండా నిలిచిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలు దేశ జనాభాలో సగానికి పైగా ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారికి తగిన స్థానం లభించకపోవడం ఒక పెద్ద లోపమని, ఈ బిల్లు ఆ లోటును భర్తీ చేసే దిశగా కీలక పాత్ర పోషించేదని పేర్కొన్నారు. కానీ ఈ అవకాశాన్ని అడ్డుకోవడం వల్ల మహిళల రాజకీయ సాధికారత మరింత ఆలస్యమవుతుందని, సమాజ అభివృద్ధిపై కూడా దీని ప్రభావం పడుతుందని అన్నారు. అదేవిధంగా, మహిళల అభ్యున్నతికి అవసరమైన నిర్ణయాలను రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరైంది కాదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల హక్కులు, గౌరవం, సమాన అవకాశాల కోసం అందరూ ఏకమై నిలబడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ సెల్ కో కన్వీనర్, మాజీ జెడ్పిటిసి మునిగంటి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యామ్ సుందర్ శర్మ, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షులు బుద్ధవరం వేణుగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఏనుగు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ర వెంకటేశ్వరరావు, ఎలసాని నాగరాజ్ యాదవ్, వల్లల శ్రీనివాస్ గౌడ్, రామారం గిరి గౌడ్, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు సూర్య శేఖర్ రెడ్డి జూపల్లి నరేష్, మాధవరావు, గుమ్మడి చంద్రా రెడ్డి, వెంకట చారి, వినయ్ రెడ్డి, రమాదేవి, కత్రోజు అశోక్, పవన్ పీసరి, కృష్ణా చారి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 20 దరువు జాతరను విజయవంతం చేయండి
### ఎమ్మెల్సీ విజయశాంతి,మల్లు రవి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే ): దరువు తెలంగాణ సాంస్కృతిక చైతన్య వేదిక ఏర్పడి నేటికీ 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈనెల 20 తారీఖున రవీంద్రబారతి లో జరిగే దరువు జాతరను వేలాదిగా కళాకారులు తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ ఉద్యకారురాలు ఎమ్మెల్సీ విజయశాంతి, మల్లు రవి పిలుపునిచ్చారు. తన నివాసం లో దరువు కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దరువు వ్యవస్థాపకులు దరువు ఎల్లన్న దరువు రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుమల్, సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ కొండపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పలు సమస్యలపై కలిసిన గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే ) చింతల్ సర్కిల్ పరిధిలోని గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈరోజు స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి తమ కాలినిలలో చేపట్టవలసిన కొన్ని అభివృద్ధి కార్యక్రమాల గురించి షాపూర్ నగర్ లోని శ్రీశైలం గౌడ్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గణేష్ నగర్ లో చేపట్టవలసిన అంతర్గత రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతులను తొందర్లోనే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. నియోజకవర్గం లోని పలు బస్తీలు మరియు కాలనీల నుండి వచ్చిన స్థానిక ప్రజల నుండి వినతులను సైతం స్వీకరించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అదేవిధంగా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేసి, ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తానని గతంలోనే తెలిపినట్టు వారు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు,దుర్గారావు, లింగం యాదవ్, వెంకటేష్ యాదవ్, భాస్కర్, యాదగిరి గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..



## వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తాం
### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే ) జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి లోని నందనవనం కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా శివారు ప్రాంతాలలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నామని, రానున్న రోజుల్లో కాలనీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. అంతకముందు స్థానిక శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవాలయం (మరకత) అభయాంజనేయ స్వామి దేవాలయం లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నందనవనం కాలనీ వాసులు మోహన్, సురేష్, రాజశేఖర్, మహేష్, కిషోర్, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, సుజాత, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సతీష్, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## నాగారం ఆల్ కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

నాగారం, ఏప్రిల్ 18:-(వాయిస్ టుడే): ఎంఎంసీ నాగారం పరిదిలోని ఆల్ కాలనీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ శనివారం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు మాజేటి వేణుగోపాల్, వర్కింగ్ అధ్యక్షుడు సిహెచ్ సాయినాథ్ గౌడ్, ఉపాధ్యక్షుడు చదలవాడ దేవి ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు, సహాయ కార్యదర్శి పి కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్. భాస్కర్ రెడ్డి, ఖజాంచి టి రామ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ రావు, వై హనుమంత్ రావు, పి వి రాఘవ రావు, పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించి కాలనీలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.

వాయిస్
హైదరాబాద్
ఆదివారం 19 ఏప్రిల్ 2026

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ అడ్డుగోడ
### - బీజేపీ నేత గోపాల్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):పార్లమెంటులో 33% మహిళా రిజర్వేషన్ బిల్లుకు (131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026) వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ మరియు 'ఇండి' కూటమి వైఖరిని తీవ్రంగా ఖండించటం జరిగింది. పార్లమెంటులో జరిగిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన తీరు ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని బీజేపీ నాయకులు గోపాల్ గౌడ్ మండిపడ్డారు. దేశంలోని కోట్లాది మంది మహిళల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దాన్ని అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. మహిళా వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ 33% మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా, కాంగ్రెస్ పార్టీకి మహిళా సాధికారతపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని గోపాల్ గౌడ్ విమర్శించారు.

అభివృద్ధికి విఘాతం: కేవలం రాజకీయ ఉనికి కోసం దేశాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటోందని, 'నారీ శక్తి' పట్ల వారికి గౌరవం లేదని ఈ ఓటింగ్ ద్వారా స్పష్టమైందని ఆయన ఆరోపించారు. చారిత్రక అవకాశం చేజార్చారు దేశ అత్యున్నత సభలో మహిళలకు ప్రాతినిధ్యం పెంచే చారిత్రక అవకాశాన్ని కాంగ్రెస్ తన సంకుచిత రాజకీయాలతో అడ్డుకుందని, దీనికి ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజలే బుద్ధి చెబుతారు: మహిళా లోకం ఈ విషయాన్ని గమనిస్తోందని, రాబోయే రోజుల్లో మహిళలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని గోపాల్ గౌడ్ పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే వరకు తన పోరాటాన్ని ఆపదని, కాంగ్రెస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహిళా సాధికారత సాధించి తీరుతామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.




## భౌరంపేట్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం
### – ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా విశేష స్పందన

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(వాయిస్ టుడే): ఆర్ఎస్ఎస్ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శతాబ్ది వేడుకలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ఉదయ్ మహారాజ్ స్వామీజీ (యోగధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్) హాజరై ధార్మిక విలువలు, సంస్కృతి పరిరక్షణపై సందేశం ఇచ్చారు. మహిళా వక్త గా శ్రీమతి ఉషా ముదిగొండ (రాష్ట్ర సేవికా సమితి, బర్కత్ పూర, భాగ్ ప్రముకులు, భాగ్యనగర్ ఏబీవీపీ వైస్ ప్రెసిడెంట్) హాజరై యువతలో దేశభక్తి, సేవా భావం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

ముఖ్య వక్తగా శ్రీ గాజుల శివశంకర్ గారు (=ూా ప్రచారకులు, తెలంగాణ ప్రాంతీయ ప్రముకులు) పాల్గొని హిందూ సమాజ ఐక్యతపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. కార్యక్రమం సందర్భంగా భజనలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. స్థానిక యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత శోభ తీసుకొచ్చారు. గ్రామంలోని వివిధ కాలనీల నుండి వచ్చిన ప్రజలు ఏకమై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయడం విశేషం.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. మీ ఆయుష్షును పెంచుకోని.. మీ జీవితాలలో వెలుగులు నింపుకోండి
### :– భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):– యాదాద్రి భువనగిరి జిల్లాఎస్పీ ఆకాంక్ష యాదవ్ ఆదేశాల మేరకు, అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా,గూడూరు టోల్ గేటువద్ద ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చే 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, భోంగిర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మధుసూదన్, ఆర్టీఓ సాయికృష్ణ, టోల్ అధికారులు పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. స్కూల్ బస్సు డ్రైవర్ లైసెన్స్, ప్రథమ చికిత్స కిట్, బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌లను తనిఖీ చేసి,వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బైక్ కారు నడిపే వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వాహకులు భోంగిర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

# పెద్ద ఎత్తున లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నామని మున్నూరు కాపు సత్రం ట్రస్టు అధ్యక్షులు నీతి విద్యాసాగర్ అన్నారు శనివారం యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఈనెల 19 అనగా ఆదివారం రోజున మున్నూరు కాపు సత్రం ఆవరణలో 108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం అనంతరం ఒక వెయ్యి ఎనిమిది మంది దంపతులతో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు లోక కళ్యాణదుర్గం విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు మున్నూరు కాపు సామాజిక బంధువులతో పాటు అనేక మంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బంధువులతోపాటు ప్రముఖులు వీఐపీలు వస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని వసతి భోజన సదుపాయాలతో పాటు ఇతర ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని రకాల ఏర్పాటు చేశామని అన్నారు పెద్ద ఎత్తున మున్నూరు కాపు సామాజిక వర్గ బంధువులు పాల్గొని



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ శ్రీనివాస్ విక్రమ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి సన్నిధిలో నేడు మున్నూరు కాపు సంఘం భవనంలో 108, జంటలతో విశ్వశాంతి.. 1008 జంటలతో మహా యజ్ఞం
### మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):– నేడు 19 ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు గల మున్నూరు కాపు భవనం లో 108 జంటలతో విశ్వశాంతి మహా యజ్ఞం, 1008 జంటలతో కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది. ఈ సందర్భంగా మన పీర్జాదిగూడ కార్పొరేషన్ లిమిట్స్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్ కి, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని.. మన కుల సంఘాన్ని ఆహ్వానిస్తూ..గొడ్డు లక్ష్మణ్ పటేల్ కు ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగినది. సుమారు 5000 వేల మందికి పైగా భక్తులు హాజరు కాబోతున్న ఈ కార్యక్రమానికి మన మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు, కుల బంధువులు నేడు 19 న ఆదివారం రోజున ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుచున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో..108 జంటలతో విశ్వశాంతి మహా యజ్ఞం,1008 జంటలతో కళ్యాణ మహోత్సవం,5000 భక్తుల హాజరు,సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు, మున్నూరు కాపు సభ్యులు ప్రతి ఒక్కరు హాజరుకావాలని మున్నూరు కాపు సంఘం పీర్జాదిగూడ కార్పొరేషన్ లిమిట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్,ప్రధాన కార్యదర్శి : లక్కాకుల సంజీవ పటేల్, కోశాధికారి ఆకుల శ్రవణ్ కుమార్ పటేల్ఉకమిటీ సభ్యులు పేర్కొన్నారు.



రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఢిల్లీ పర్యటన లో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ముఖ్యమంత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి )



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, చేనేత మరియు జోలి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా నేతన్నకు ఆరోగ్య భద్రత మెగా వైద్య శిబిరం కార్యక్రమాన్ని భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లు మాట్లాడుతూ సంబంధిత వార్డు ప్రజలందరూ కూడా ఇట్టి ఉచిత క్యాంప్ ను వినియోగించుకుని ఉచిత పరీక్షలు చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏలే భువనేశ్వరి శివ కుమార్ , నాజియా రెహమాన్ జహంగీర్, భోజిన శారధ ఉదయ్, డాక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

- యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి

## కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరు
### త్వరలోనే చెరువులో సుందరీకరణ పనులకు శ్రీకారం
### ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి




ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– కాప్రా చెరువులో రూ.35 కోట్ల లతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువులను సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా చెప్పారు.శుక్రవారం(17న) కాప్రా చెరువును పరమేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు.ఉప్పల్ నియోజకవర్గంలోని లిఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఇదే కాకుండా నాచారం హెచ్ఎంటీ నగర్ చెరువు రూ.30కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా చెప్పారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి,స్వర్ణరాజ్ శివమణి,సింగిరెడ్డి ధన్ఫల్ రెడ్డి ,పావని రెడ్డి,మాజీ కౌన్సిలర్ రాజేందర్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతా రామ్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారంగా సమర్థవంతంగా నిర్వహించాలి
### :- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):– ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు.



విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 85 ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఈడి యస్.సి కార్పొరేషన్అధికారి శ్యాంసుందర్ ,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితీ, ఎంపీడీవోలు,గృహ నిర్మాణ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నిర్ణయమే ఫైనల్..

## అమీన్పూర్ ఎస్టిపిని తరలిస్తాం లేదా రద్దు..

## అవసరమైతే ముఖ్యమంత్రితో సైతం చర్చిస్తాము

## ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..



పటాన్చెరు : ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్ లో ఏర్పాటు చేయదలచిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి ) ను తరలించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని 993 సర్వే నంబర్లో ఎస్ టి పి ఏర్పాటు చేయనున్న స్థలంలో శనివారం ఆయా కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ పరిధిలోని మురుగు నీటి జలాలను శుద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక కాలనీల ప్రజల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాలు తలెత్తుతున్న నేపథ్యంలో.. మెజార్టీ ప్రజలు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టిపిని తరలించడం లేదా రద్దు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమీన్పూర్ లో ఎస్టీపీని ఏర్పాటు చేయడం జరగదని స్పష్టం చేశారు. అత్యంత అవసరమైతే ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి నక్కవాగులోకి తరలించడం జరుగుతుందని తెలిపారు. పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్లాంట్ ఏర్పాటుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి సిజిఎం పద్మజ, జిఎం సుబ్బారాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## సివిల్ ఇంజనీరింగ్‌లో అహ్మద్ మిన్హాజుద్దీన్ కు పీహెచ్.డీ.



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి అహ్మద్ మిన్హాజుద్దీన్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సిమెంటు, సూక్ష్మ కంకరకు పాక్షిక ప్రత్యామ్నాయాలుగా వ్యవసాయ-పారిశ్రామిక వ్యర్థాలను చేర్చిన సుస్థిర కాంక్రీటుపై ఒక అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరిజిత్ సాహా శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ అధ్యయనం, కాంక్రీటులో శుద్ధి చేయని చెరకు పిప్పి బూడిద (Ut-SCBA), వ్యర్థ గ్రానైట్ పొడి (WGP) వినియోగాన్ని అన్వేషించడం ద్వారా పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ యొక్క తీవ్రమైన సవాలును పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ పరిశోధన ఎం25 గ్రేడ్ కాంక్రీట్ లో సిమెంటు, ఫైన్ అగ్రిగేటుకు పాక్షిక ప్రత్యామ్నాయాలుగా వాటి ప్రభావాన్ని సమగ్ర యాంత్రిక, మన్నిక, సూక్ష్మ నిర్మాణ విశ్లేషణల ద్వారా మూల్యాంకనం చేస్తుందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు 15 శాతం ఫ్-చాజదీూ, 30 ఔటూల ఉత్తమ మిశ్రమాన్ని గుర్తించాయని తెలిపారు. ఇది మెరుగైన బలం, మన్నిక, పర్యావరణ హితంగా ఉంటుందన్నారు. ఈ అధ్యయనం, డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించి, సహజ వనరులను పరిరక్షించే ఒక ఆచరణీయమైన, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాన్ని వెలుగులోకి తెస్తోందని వివరించారు. డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రమేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అఖిలేష్ చేకూరి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చిన్న ఆవుటపల్లిలో 'జలధార -- జల హారతి'

### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర,విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరం (మం)చిన్న ఆవుటపల్లి గ్రామంలో "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "జలధార -- జల హారతి" కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు స్వయంగా పలుగు, పారా పట్టి నీటి గుంతలను తవ్వారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో నీటి యాజమాన్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జల మట్టాన్ని సగటున 6 మీటర్లకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి వర్షపు బొట్టును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ మట్టి తవ్వకాలపై ఎంక్వైరీ చేయడం జరిగిందని తెలిపారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో గణనీయమైన భాగం ఆంధ్రప్రదేశ్‌కు వస్తోందని, దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం అభివృద్ధినే అజెండాగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన అక్రమ మట్టి తవ్వకాల కారణంగా చెరువుల్లో ప్రమాదాలు చోటుచేసుకుని 36 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా, మైనింగ్ నిధుల ద్వారా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా పేద ప్రజలు తమ పొలాలు, ఇళ్ల స్థలాలు మెరక చేసుకునేందుకు ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా మట్టిని తరలించుకునే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. గన్నవరం ప్రాంతంలో 15 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే సుమారు 9 వేల మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో కేంద్ర నిధులతో సీ-డాక్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జీవో 30 ద్వారా మంగళగిరి తరహాలో గన్నవరంలో 900 మందికి ఇళ్ల పట్టాలు అందజేసి, మరింత మందికి పంపిణీకి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పి నైనవరం గ్రామంలో కృష్ణ యూనివర్సిటీ కోసం భూమి కేటాయించినట్లు, నియోజకవర్గవ్యాప్తంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## హజ్ యాత్రికులకు పచ్చజెండా ఊపి వీడ్కోలు పలికిన మంత్రులు ఎన్.ఎం.డి.ఫరూఖ్, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతున్న ముస్లిం మైనార్టీ సోదరులను నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్ హాల్‌లో శనివారం మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూఖ్, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుంటూరు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, శాసనమండలి మాజీ చైర్మన్ ఎం.ఎ. షరీఫ్, నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, అనంతరం పచ్చ జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే మక్కా యాత్రను జీవితంలో ఒక్కసారైనా చేయాలనే కోరిక కలిగి ఉంటారని తెలిపారు. అలాంటి హజ్ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు సుమారు 1,987 మంది యాత్రకు బయల్దేరగా, విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి 353 మంది వెళ్ళటం ఆనందకరమన్నారు. మైనార్టీల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ఇమామ్‌లు మరియు మౌజంలకు ఆర్థిక సహాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. త్వరలోనే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మరిన్ని ఆర్థిక పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో హజ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అన్ని వర్గాలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అల్లా కృప రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షించారు.




## యార్లగడ్డ వెంకట్రావు సేవా స్ఫూర్తితో పొట్టిపాడులో చలివేంద్రం ప్రారంభం




కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే) ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నిఖిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖులు ఘనంగా ప్రారంభించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సేవా స్ఫూర్తితో, యలమర్తి అర్లప్ప మరియు గుడ్డేటి సుధాకర్ జ్ఞాపకార్థం తో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి యార్లగడ్డ సతీష్ బాబు, ఉంగుటూరు మండల అధ్యక్షులు కొలుసు రవీంద్ర, కుందేటి చంద్రశేఖర్, ౹ూజా చైర్మన్ అట్లూరి జోషి మధు, గుడ్డేటి సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి నిఖిల్ ముందుండి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఈసరి రవి, మహిళా అధ్యక్షురాలు పొదిలి మధులత, విద్యా కమిటీ చైర్మన్ కాండ్రు రమేష్, ఎక్స్ ఎంపీటీసీ కడియాల శ్రీను, ఎక్స్ సర్పంచ్ గుండపనేని శ్రీధర్, సర్పంచ్ కత్తుల బోస్, సీతయ్య, తమలం నాని తదితరులు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్-రజిత దంపతుల కుమారుడు హరిహరన్ సాయి-దీక్షల వివాహానికి ముందు సంగీత్ వేడుక శనివారం రాత్రి ఘనంగా జరిగింది. హైదరాబాద్ ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ లోని అన్వయ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హాజరై కాబోయే వధూవరులు హరిహరన్ సాయి-దీక్షలకు తమ ఆశీస్సులు అందజేశారు.ఎమ్మెల్యే కమలాకర్-రజిత దంపతులు, వారి కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## భువనగిరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేనేత కార్మికులకు మెడికల్ క్యాంప్ నిర్వహించడం సంతోషకరం

### బోనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భువనగిరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేనేత కార్మికులకు మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బోనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ అడిషనల్ డైరెక్టర్ హ్యాండ్లూమ్ సైంటిస్ట్ టెక్స్టైల్స్ శ్రీనివాసరావు తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ భువనగిరి మండలం మరియు పట్టణంలోని చేనేత కుటుంబాలు ఈ యొక్క వైద్య శిబిరం యొక్క అవకాశాన్ని వినియోగించుకుని వైద్య చికిత్సలు. జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ చేనేత కుటుంబాలు ఎటువంటి వ్యాధులు ఉన్నా సరే ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామని తెలియజేశారు కావున ప్రతి చేనేత కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సుమన్ కళ్యాణ్ గారు వైద్యాధికారులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ యొక్క మెడికల్ క్యాంపులో 127 పేషంట్లకు చికిత్స చేయడం జరిగింది. ఇందులో ఆర్థోపెడిక్ సంబంధించి 36 మంది, సాధారణ చికిత్సలకు సంబంధించి 51, కంటికి సంబంధించి 40 మందికి చికిత్స అందించడం జరిగింది. పదిమందిని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ భువనగిరికి తదుపరి చికిత్సకు రెఫర్ చేయడం జరిగింది.



## సచివాలయంలో మంత్రి గడ్డం వివేక్‌ని కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్

### అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు మండలానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ఇతర ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



## అయ్యప్ప స్వామి దేవాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చెరు : పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో గల అయ్యప్ప స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సపానదేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, సంజీవ రెడ్డి, నరసింహ రెడ్డి, ప్రకాష్ రావు, మాణిక్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమ నిర్వహణ

### కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు అంగన్ వాడి సిబ్బంది

ధర్మపురి, ఏప్రిల్ 18 (వాయిస్ టుడే) : జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండలం లోని బుగ్గారం గ్రామంలో గల స్థానిక అంగన్ వాడి కేంద్రం యందు శనివారం రోజు మధ్యాహ్నం వేళలో పోషన్ పక్వాడ్ కార్యక్రమం లను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమ శుభ సందర్భంగా అంగన్ వాడి ఉపాధ్యాయురాలు సరిత కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం గురించి తల్లిదండ్రులు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వారికీ పలు సలహాలు సూచనలు ఇచ్చారు. తల్లి బిడ్డల మధ్య ఆరోగ్యకరమైన సంభాషణలు, ఆటల ద్వారా, అభ్యాసన పద్ధతులను నేర్పించడం వల్ల ఆహారం తినిపించే సమయంలో పిల్లలతో మాట్లాడడం వల్ల ఇంట్లో అందుబాటులో ఉన్నటువంటి వస్తువులతో ఆడుకోవడం వల్ల పిల్లల ఎదుగుదలలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో ఉంటుంది అని, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల గురించి చెప్తూ వారు చెప్పే కథలను పిల్లలకు చెప్పాలని వారికీ వివరించారు. పిల్లలకు పోషకాలు ఉన్న ఆహారము అందించాలని వారికీ సూచించారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, తల్లిదండ్రులు, అంగన్ వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలు బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

- బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం
- సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి
- చైర్మన్ మానస స్వర్ణ,సుమన్

నాగార్జునసాగర్ ఏప్రిల్ 18 వాయిస్ టుడే: నందికొండ మున్సిపాలిటీ పరిధిలో పోషణ్ పక్వాడా ఉత్సవాల్లో భాగంగా శనివారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మానస స్వర్ణ,సుమన్ హాజరై,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు,బాలింతలు మరియు చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తల్లి మరియు శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనుముల సిడిపిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ,సమాజంలో బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని,చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు.అనంతరం చట్టంపై అవగాహన కల్పిస్తూ,బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.ప్రస్తుత కాలంలో యువత సోషల్ మీడియాకు బానిసలు కాకూడదని,సైబర్ బుల్లింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యా బోధన పిల్లల మేధో వికాసానికి తోడ్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ,సాగర్ బాబు,జానకి వెంకటేష్, రమణ సైదులు,వెనిషా రాజేష్,పగడాల నాగరాజు,సూపర్ వైజర్ వెంకాయమ్మ, హెల్త్ డిపార్ట్మెంట్ లింగయ్య,మున్సిపాలిటీ భరద్వాజ,అంగన్వాడీ టీచర్లు పుష్ప, రాజేశ్వరి, నిర్మల,దేవిక, ఆదిలక్ష్మి,సైదమ్మ,సరళ,నయీము,పర్వీన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పిట్లంలో 99వ రోజుల కార్యక్రమంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

వాయిస్ టుడే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 17: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు అయినా గోల్డెన్ అవర్ ప్రోగ్రాం అరైవ్ అలైవ్ -- రోడ్డు భద్రత కార్యక్రమం" నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగించాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులను పోలీసులు ప్రత్యేకంగా గులాబీ పువ్వు చేతికి ఇచ్చి వారిని అభినందించారు. అలాగే హెల్మెట్ ధరించని వారిని నిలిపివేసి నిబంధనలు పాటించాలని సూచిస్తూ చెవిలో గులాబీ పువ్వు పెట్టి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రాణాపాయ ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం సబ్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు హెడ్ కానిస్టేబుల్ సాయి గౌడ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## పవర్ హౌస్‌లో ఫైర్ మాక్ డ్రిల్



నాగార్జునసాగర్, ఏప్రిల్, 18: వాయిస్ టుడేబీ నాగార్జునసాగర్ లోని జెన్కో ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్ కుమార్ ఆధ్వర్యంలో ఫైర్ మాక్ డ్రిల్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డిఐజి మాధవ రావు ఉత్తర్వుల మేరకు నాగార్జునసాగర్ లోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమం ఫైర్ సర్వీసెస్ వీక్ 2026 కార్యక్రమంలో భాగంగా జెన్కో ఫైర్ విభాగానికి చెందిన అధికారులు, ఎస్ పి ఎఫ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో అనుకోకుండా అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలను ఎలా అడ్డుకట్ట వేయాలి, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలగకుండా ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోవాలనే విషయంలో సాగర్ జెన్కో అధికారులు, ఫైర్ సిబ్బంది, నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్, జెన్కో ఎస్ పి ఎఫ్ సిబ్బందిలతో కలిసి ఫైర్ మాక్ డ్రిల్ ను నిర్వహించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ లు రఘురాం, రామకృష్ణారెడ్డి, జెన్కో డి ఈ, ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జెన్కో ఆర్ ఐ ప్రతాప్ నాయుడు సాగర్ డ్యాం ఆర్ఐ శ్రీనివాసరావు, డి ఈ లు, జెన్కో, ఎస్ పి ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సోన్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 18: సోన్ మండల కేంద్రంలో శనివారం ఏఎంసీ చైర్మన్ సోమ భీమారెడ్డి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు క్వింటానుకు రూ.2400 కనీస మద్దతు ధర ఉంటుందని రైతులు దళారులను నమ్మ కుండా కొనుగోలు కేంద్రంలో పంట అమ్మి లబ్ధి పొందాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## మాలధారణ కార్యక్రమానికి హాజరైన పీఠాధిపతి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 18: బైంసా పట్టణంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రేయ ఆధ్వర్యంలో శనివారం జరిగిన హనుమాన్ స్వాముల అర్ధమండల మరదలు కార్యక్రమానికి ఆల్ ఇండియా హనుమాన్ దీక్ష సేవ సమితి అధ్యక్షులు విజయవాడ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులకన్నా బాధ్యత గొప్పదని కష్టాల్లో కలిసి నడవాలని కుటుంబ బాధ్యతలను పంచుకోవాలని నమ్మిన వారి కోసం తెగించాలని శ్రీరామ సీత లక్ష్మణ ఆంజనేయ తత్వాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తోపాటు బైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు భేష్

### ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య ప్రకటన



మెట్ పల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంచి నీరు, విద్యుచ్ఛక్తి, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం,అర్హత గల విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు,అనుభవజ్ఞులైన ఉపన్యాసకులు వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయని,అందువల్ల మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెంటనే చేరాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు . జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రాఘవపేట, సిర్ పూర్ గ్రామాలలో "దోస్త్" అడ్మిషన్ల కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్మీడియట్,వొకేషనల్,ఓపెన్ ఇంటర్ లలో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రావాలని,వారికి ఆన్లైన్ లో కళాశాలలోనే రిజిస్ట్రేషన్ లు చేస్తామని విద్యార్థులకు సూచించారు. మొదటి దశలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 200 రూపాయల ఛార్జీని వసూలు చేస్తామని,ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అందువల్ల విద్యార్థులు అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ లు చేసుకోవటానికి అధిక సంఖ్యలో తరలి రావాలని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య పిలుపునిచ్చారు. అనంతరం రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ...ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేర్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థలలోనే విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని, అందువల్ల విద్యార్థులను ప్రభుత్వ విద్యా సంస్థలలో చేర్పిస్తామని సర్పంచ్ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఈ అడ్మిషన్ ల ప్రచార కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు అంజయ్య, సత్యశోధన్ లతో పాటు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్,గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు,పూర్వ విద్యార్థులు విజయ్,నరేందర్,శేఖర్,రమేష్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం పట్ల ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే)బీ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లలో సచివాలయాల పనితీరు, సిబ్బంది గైర్హాజరు, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యంపై ప్రజల నుండి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ విప్ మరియు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం రామవరప్పాడు-1, 2, 3, ప్రసాదంపాడు-2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ తనిఖీలలో సచివాలయ వ్యవస్థలోని లోపాలను ఆయన గుర్తించారు. తనిఖీ సమయంలో పలువురు సిబ్బంది విధులకు గైర్హాజరు కావడాన్ని ఎమ్మెల్యే గమనించారు. సెలవులో ఉన్నవారు మాన్యువల్ రిజిస్టర్ నమోదు చేసినప్పటికీ, ఆన్లైన్ సిస్టమ్ లో ఎందుకు నమోదు చేయలేదని అధికారులను నిలదీశారు. ముఖ్యంగా విజిటర్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సచివాలయాల్లో విజిటర్స్ రిజిస్టర్ అసలు లేకపోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. కేవలం 2,300 ఓట్లు ఉన్న గూడవల్లి వంటి చిన్న గ్రామాల్లో 10 మంది సచివాలయ సిబ్బంది ఉండగా, దాదాపు 23,000 ఓట్లు, 50,000 జనాభా ఉన్న రామవరప్పాడు వంటి పెద్ద గ్రామాలకు కేవలం 25--30 మంది సిబ్బంది మాత్రమే ఉండటాన్ని ఎమ్మెల్యే తప్పుబట్టారు. జనాభా ప్రాతిపదికన సిబ్బందిని హేతుబద్ధీకరించేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. 50,000 జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా లేదని, వెలగలేరు వంటి చిన్న పల్లెటూర్లలో పీహెచ్‌సీ ఉండగా, ఇంత పెద్ద జనాభా ఉన్న రామవరప్పాడు ప్రాంతంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇక్కడ వెంటనే పీహెచ్‌సీ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రామవరప్పాడు-2 సచివాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం అస్తవ్యస్తంగా ఉందని, పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారిందని ఎమ్మెల్యే మండిపడ్డారు. నెలకు రూ. 15,000 అద్దె చెల్లిస్తున్నప్పటికీ, ప్రజలు కూర్చోవడానికి కూడా స్థలం లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఆగిపోయిన సచివాలయ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని, త్వరలోనే కొత్త భవనాల్లోకి మారుస్తామని చెప్పారు. మార్చి నెలలో రామవరప్పాడు సచివాలయం-2లో కేవలం 38 మందికి, మరో రెండు సచివాలయాల్లో 28, 35 మందికి మాత్రమే సేవలు అందించడంపై ఎమ్మెల్యే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో జనాభా ఉన్న చోట ఇంత తక్కువ మందికి సేవలు అందడం అంటే సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేరని అర్థమవుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రతి సచివాలయానికి ఒక ఇంజనీర్‌ను కేటాయించడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. గతంలో మండలానికి ఒక ఇంజనీర్ ఉన్నప్పుడే పనులు మెరుగ్గా సాగేవని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి ఆస్తిలా ఉండాలి తప్ప, కేవలం సమస్యలకు సాక్షులుగా మిగిలిపోకూడదని అన్నారు. నిబంధనల ప్రకారం రిజిస్టర్లు నిర్వహించని వారికి మెమోలు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వచ్చే వారం విజయవాడ రూరల్ మండలంలోని 9 గ్రామాల్లోని మొత్తం 21 సచివాలయాల సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. విజిటర్స్ రిజిస్టర్, సర్వీస్ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచిస్తూ, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.